ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

శనివారం 3 ఫిబ్రవరి 2024



వైసీపీ రివర్స్ గేర్

- నారాయణస్వామి జీడీనెల్లూరుకే
- రెడ్డప్ప చిత్తూరు పార్లమెంటుకే
- ఇద్దరికీ మళ్లీ పాత స్థానాలే
- పోటీకి ఇద్దరూ విముఖత చూపడంతోనే ఈ నిర్ణయం?



చిత్తూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల ప్రకటన విషయంలో వైసీపీ అధిష్ఠానం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. నాలుగో జాబితాలో ప్రకటించిన పేర్లను.. శుక్రవారం విడుదల చేసిన ఆరో జాబితాలో మార్చేసింది. నారాయణస్వామి నేరుగా సీఎం జగన్‌ను కలిసి మరో అవకాశం కోసం అభ్యర్థించడం, ఆయన వర్గం నుంచి తీవ్ర అసమ్మతి రాగం వినిపించడం కారణాలుగా తెలుస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో తిరుపతి లోక్‌సభ ఇన్‌చార్జిగా ఎంపీ గురుమూర్తిని రీబ్యాక్ చేయడం.. సత్యవేడు ఇన్‌చార్జిని మార్చిన విషయం తెలిసిందే.

డిప్యూటీ సీఎం నారాయణస్వామికి సొంత నియోజకవర్గం జీడీనెల్లూరులో గట్టి వ్యతిరేక వర్గం ఉన్న విషయం తెలిసిందే. జ్ఞానేంద్రరెడ్డి, దయాసాగర్‌రెడ్డి వంటి ఆయన వ్యతిరేకులకు మంత్రి పెద్దిరెడ్డి మద్దతు కూడా ఉండడంతో వారంతా నారాయణస్వామికి వ్యతిరేకంగా గట్టిగా పనిచేశారు. నారాయణస్వామికి టికెట్ ఇస్తే పనిచేసేది లేదని అనేకమార్లు ప్రకటించారు. పెనుమూరు మండలంలో డిప్యూటీసీఎం పర్యటిస్తే అడ్డుకోవడాలు అనేకం ఉన్నాయి. దీంతో అధిష్ఠానం విడుదల చేసిన నాలుగో జాబితాలో నారాయణస్వామికి జీడీనెల్లూరు కాకుండా చిత్తూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు ఇన్‌చార్జిగా ప్రకటించారు. దీంతో నారాయణస్వామి వ్యతిరేకవర్గం తామే గెలిచామంటూ సంబర పడింది. దీనికి దీటుగా నారాయణస్వామి అనుకూలవర్గం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి రెడ్డెప్ప అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించింది. ఆయా మండలాల నాయకులు చిత్తూరు, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లలోనూ ప్రెస్‌మీట్లు పెట్టి నారాయణస్వామికే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి అనుగుణంగా నారాయణస్వామి కూడా నేరుగా సీఎం జగన్‌ను కలిసి, తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నాయకులను నమ్ముకోకుండా నేరుగా సీఎంను కలవడంతోనే ఆయనకు మరో అవకాశం దక్కినట్లు నారాయణస్వామి వర్గీయులు చెబుతున్నారు. జిల్లాను శాసిస్తున్న రెడ్లతో పాటు నియోజకవర్గంలోని రెడ్లను తట్టుకుని, అధిష్ఠాన నిర్ణయాన్ని మార్పించుకోవడంతో నారాయణస్వామి వర్గీయులు సంబర పడుతున్నారు.

● ఇదిలా ఉండగా, ఎంపీ రెడ్డెప్ప కూడా జీడీనెల్లూరు నుంచి పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించినా.. ఆయన నియోజకవర్గంలో పర్యటించలేదు. పరిచయాలు పెంచుకోలేదు. ఓ సందర్భంలో చిత్తూరులో ఆయన మాట్లాడుతూ 'సీట్ల సర్దుబాటు విషయంగా నేను స్పందించను. అధిష్ఠానం ఆదేశాల మేరకు నడుచుకుంటాను. పోటీ చేస్తాను. నారాయణస్వామి నాకు మంచి మిత్రుడు' అని చెప్పారు. అంటే తనకు ఫలానా టికెట్ కావాలని ఆయన ఎన్నడూ కోరలేదు.

అధికారపార్టీలో అభద్రతాభావం

ఓసారి ప్రకటించిన ఇన్‌చార్జులను మరోసారి కూడా వైసీపీ అధిష్ఠానం మారుస్తుండడంతో ఆ పార్టీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైందనే చెప్పాలి. అది మూలం ఎఫెక్ట్‌తో తిరుపతి లోక్‌సభకు ఎంపీ గురుమూర్తిని వెనక్కి పంపి.. సత్యవేడు అసెంబ్లీకి కొత్త నేతను ఇన్‌చార్జిగా ప్రకటించింది. ఇక, చిత్తూరు ఎంపీ, జీడీనెల్లూరు అసెంబ్లీ ఇన్‌చార్జుల విషయంలో రివర్స్ గేరులో వెళ్లింది. ఈ పరిణామాలతో ఇప్పటికే ఇన్‌చార్జులుగా నియమితులైన వారితో పాటు తమకే సీటు అనుకుంటున్న అభ్యర్థుల్లోనూ అభద్రతాభావం మొదలైంది. ఈ జాబితాలో తమ పేరున్నప్పటికీ, మరో జాబితాలో ఉంటుందా.. ఊడుతుందా అని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆందోళన చెందుతున్నారు.



క్రీడాప్రాధికార సంస్థ అధికారుతో జీడీనెల్లూరు క్రీడాకారుల వాగ్వాదం

ఇలాగేనా ఆడించేది?

- అంపైర్ల భిన్న నిర్ణయంతో క్రికెట్ మ్యాచ్‌లో గొడవ
- ఆగిన జిల్లాస్థాయి ఫైనల్స్
- నేటికి రీషెడ్యూల్ చేసిన అధికారులు


చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 2: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదు. జిల్లా స్థాయి ఆటల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితం.. కబడ్డీ ఫైనల్స్ విజేత ప్రకటనపై ఇప్పటికే తీవ్రస్థాయిలో విమర్శలు.. క్రీడాకారుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఇక, శుక్రవారం నాటి క్రికెట్ ఫైనల్స్‌లోనూ అవుట్ విషయంలో అంపైర్ల తడబాటు.. భిన్న నిర్ణయాలతో గొడవకు దారితీసింది. చివరకు అధికారులు శనివారం నాటికి వాయిదా వేశారు. జిల్లాస్థాయి పోటీల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరు, జీడీ నెల్లూరు మధ్య క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. 10 ఓవర్లకు గాను చిత్తూరు జట్టు 92 పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన జీడీనెల్లూరు జట్టు 1.2 ఓవర్లకు 17 పరుగులు చేసింది. రెండో ఓవర్లో బ్యాటింగ్ చేస్తుండగా బంతి బ్యాట్‌కు తాకిందని మెయిన్ అంపైర్ అవుట్ ఇచ్చారు. వైడ్‌బాల్‌ను అవుట్ ఎలా ఇస్తారని బ్యాట్స్‌మన్ అప్పీల్ చేశారు. దీంతో అంపైర్‌ను మెయిన్ అంపైర్ లెగ్ సంప్రదించగా, అతడు నాటౌట్ అని చెప్పడంతో గొడవలు చెలరేగాయి. బ్యాట్స్‌మన్ అవుట్ అని చిత్తూరు జట్టు.. లెగ్ అంపైర్ నాటౌట్ ఇచ్చారుగా అని జీడీ నెల్లూరు జట్టు వాగ్వాదానికి దిగాయి. దీనిపై అధికారులు పంచాయితీ చేసి తిరిగి శనివారం ఉదయం 8 గంటలకు మ్యాచ్ రీషెడ్యూల్ చేస్తున్నామని ప్రకటించారు.

నిర్లక్ష్యంగా డీఎస్ఏ అధికారులు

తొలినుంచీ క్రీడా పోటీలను డీఎస్ఏ అధికారులు సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో ముందు నుంచే పోటీల్లో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు జిల్లా స్థాయి పోటీల్లో అది కాస్త తారస్థాయికి చేరింది. ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్నారు నిపుణులు. ఎంతలా అంటే జిల్లా స్థాయి పోటీలు అందులోను ఫైనల్స్ అధికారులు ఎంతో పకడ్బందీగా నిర్వహించాల్సి ఉంటుంది. కాస్త క్రికెట్ గురించి తెలిసిన సీనియర్ ప్లేయర్లతో అంపైరింగ్ చేయించాలి. కానీ, అధికారులు జూనియర్ క్రీడాకారులతో అంపైరింగ్ చేయించారు. దీంతో మెయిన్ అంపైర్ అవుట్ ఇస్తే, లెగ్ అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రెండు జట్ల మధ్య గొడవలకు దారితీసింది.

మృతులకు ఓట్లు.. అర్హులకు తొలగింపు

- పుంగనూరు ఓటర్ల జాబితాలో ఇలా..



మృతిచెందిన ఖాజాపీర్‌ఖాన్, బీబీజాన్‌కు కొనసాగుతున్న ఓటు

పుంగనూరు, ఫిబ్రవరి 2: పుంగనూరు తుది ఓటరు జాబితాలో చనిపోయిన వారిని తొలగించకుండా ఓటు హక్కు కల్పించారు. పట్టణంలో నివాసం ఉన్న వారి ఓట్లు మాత్రం తొలగించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జాబితాలో తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి.

● పుంగనూరు బాలికల ఉన్నతపాఠశాల పోలింగ్ కేంద్రం 37లో రాతిమసీదు వెనుకవీధిలో వరుస సంఖ్య 966లో ఓటు నెంబరు టీవీఎఫ్ 0721838లో జాఫర్ ఖాన్ కుమారుడు పి.ఖాజాపీర్‌ఖాన్ మూడేళ్ల క్రితం మృతి చెందారు. ఆయన ఓటును జాబితా నుంచి తొలగించలేదు. అలాగే పోలింగ్ కేంద్రం 37లో రాతిమసీదు వీధికి చెందిన వరుస సంఖ్య 950 సత్తార్‌సాబ్ భార్య బీబీజాన్ ఓటరుగా కొనసాగుతున్నారు. ఈమె చనిపోయి నాలుగేళ్లయింది. జాబితా నుంచి పేరు డెలిట్ కాలేదు.

అయినా, ఓటు తీసేశారు

ఇక, ఏపీరావు వీధికి చెందిన ఎస్.సత్తార్‌సాబ్ కుమారుడు ఎస్.అక్బర్‌కు వరుససంఖ్య 963లో ఓటరు సంఖ్య టీవీఎఫ్ 673559లో గత ఎన్నికల్లో ఓటు ఉంది. మెకానిక్‌గా పనిచేస్తూ పుంగనూరులోనే ఉన్నారాయన. కానీ, బీఎల్వోలు ప్రస్తుతం అతడి ఓటును తొలగించారు.



తాను పుంగనూరులో ఉన్నా తన అనుమతిలేకుండా ఎందుకు ఓటు తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

14 మంది బీఎవ్వోలకు షోకాజ్ నోటీసులు

కల్లూరు, ఫిబ్రవరి 2: పులిచెర్ల మండలంలోని 14 మంది బీఎవ్వోలకు తహసీల్దార్ శేషగిరిరావు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పొరపాట్లను సవరించడంలో బీఎవ్వోలు నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించడంతో తప్పులతో కూడిన తుది ఓటర్ల జాబితా ప్రచురితమైందన్నారు. తుది ఓటర్ల జాబితాలో వచ్చిన తప్పులపై పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఓటర్ల జాబితా సవరణలపై అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చినా తప్పులను సవరించడంలో విఫలమైన బీఎల్వోలపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

భూమి వదలకపోతే చంపేస్తాం

- పోలీసుల ఎదుటే వృద్ధులపై దౌర్జన్యం
- ప్రాణభయం ఉందంటూ డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు

పుంగనూరు, ఫిబ్రవరి 2: 'వ్యవసాయ భూమిని వదలకపోతే నిన్ను వదిలేది లేదు. మాపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా? నిన్ను చంపేస్తాం' అంటూ పోలీసుల ఎదుటే దౌర్జన్యం చేస్తున్నారంటూ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు పలమనేరు డీఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం.. పుంగనూరు మండలం ఏతూరు పంచాయతీ నల్లగుట్లపల్లెలో గంగులప్ప సోదరుడు వెంకటప్ప భూమిని బోరెడ్డి కొనుగోలు చేశారు. 'అతడు కొన్న స్థలంలో కాకుండా మా పొలాన్ని ఆక్రమించి బోరు వేశారు. అడ్డుకోగా మమ్మల్ని బెదిరిస్తున్నారు. మా కుమారుడి ఆరోగ్యం సరిగా లేదు. మేము వృద్ధాప్యంలో ఉన్నాం. తర్వాత మా భూమిని వారు బలవంతంగా లాక్కొంటారు. అందుకని రెండు నెలల కిందట సర్వే చేయించాం. కానీ మాభూమిని ఆక్రమిస్తున్నారు' అంటూ ఎ.గంగులప్ప(90), అక్కులమ్మ దంపతులు గతనెల 30వతేది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు 31వ తేది వీరి పొలం వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. మాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ఆక్రమణదారులైన కొత్తపల్లెకి చెందిన బోరెడ్డి, ఆయన భార్య పుష్పావతమ్మ, వారి బంధువు శ్రీనివాసులరెడ్డి పోలీసుల ఎదుటే దుర్భాషలాడి దౌర్జన్యం చేశారు. మరుసటి రోజు వస్తామని వెళ్లిన పోలీసులు ఇంతవరకు వచ్చి న్యాయం చేయలేదని బాధితులు వాపోయారు. పోలీసులంతా తమకు తెలుసని, నీవల్ల ఏమీకాదని తమను బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని కలిసి తమగోడు వినిపించుకోగా.. వెంటనే పుంగనూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చామన్నారు. ఇప్పటికైనా పోలీసులు న్యాయం చేసి తమకు ప్రాణరక్షణ కల్పించాలని కోరారు.



పుంగనూరు పోలీస్‌స్టేషన్ వద్ద గంగులప్ప, అక్కులమ్మ

తమ్మినాయనపల్లె వైపు జంట ఏనుగులు



సోమల, ఫిబ్రవరి 2: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలో జంట ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం తమ్మినాయనపల్లె సమీపంలోని చెరువు వద్ద మకాం వేశాయి. బంగ్లాకు చెందిన రాజన్న అరటి తోటలో సంచరించి పంటను ధ్వంసం చేశాయి. మేటిమంద వద్ద సమీప పొలాల వద్ద టమోటా తోటల్లో సంచరించి ఊతంగా నాటిన కర్రలను తొక్కి వేశాయి. గతంలో ఏనుగుల మంద ఈప్రాంతంలో సంచరించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టం అందలేదని వాపోయారు. మేటిమంద నుంచి సమీప తమ్మినాయనపల్లె చెరువు వద్దకు చేరుకోవడంతో ఆప్రాంత రైతులు ఆందోళన పడుతున్నారు.

రేషన్ కోసం ఒక వేలిముద్ర చాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: రేషన్ పొందే కార్డుదారులు శనివారం నుంచి బయోమెట్రిక్ విధానంలో ఒకసారి వేలిముద్ర వేస్తేచాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాత్రి జరిగిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు. ఎండీయూ వాహనాల ద్వారా ఉచితంగా, నగదుతో పొందే నిత్యావసర వస్తువుల కోసం ఇకపై ఒక్కసారి మాత్రమే వేలిముద్ర వేయాలని, రెండో వేలిముద్ర కోసం ఒత్తిడి చేయొద్దన్నారు.



బాలుడు కిందకు దిగిన మూడవ గోపుర ప్రదేశం



మూడవ గోపురం సమీపంలో ప్రాకారం వద్ద ఉన్న నిచ్చెన



పార్థసారథి రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ శ్రీకాళహస్తి!

- అర్ధరాత్రి ముక్కంటి ఆలయంలో సంచరించిన 14యేళ్ల బాలుడు
- దర్జాగా నిచ్చెన సహాయంతో వేకువజామున వెలుపలకు రాక
- నిఘా వైఫల్యంపై దుమారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 2: ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రతా వ్యవస్థ డొల్లతనం బట్టబయలైంది.తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి అర్ధరాత్రి ఆలయంలో దర్జాగా సంచరించాడు. తర్వాత పెద్ద నిచ్చెన సహాయంతో ప్రాకారం పైనుంచి దిగి తాపీగా కిందకు వచ్చాడు.

వివరాల్లోకి వెళితే... శ్రీకాళహస్తి శివారు ప్రాంతం సాయిబాబా నగర్‌కు చెందిన గౌరి పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటారు. ఆమెకు పార్థసారథి రెడ్డి (14) అనే మానసికంగా పరిణతి చెందని కుమారుడున్నాడు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి మరణించడంతో అమ్మ,బాబాయ్ పర్యవేక్షణలో విద్యార్థి పెరుగుతున్నాడు. పరీక్షల్లో చూసి రాస్తున్నాడంటూ పాఠశాల సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేయడంతో గురువారం సాయంత్రం ఇంట్లో పార్థసారథి రెడ్డిని మందలించారు.ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల కోసం పెయింటింగ్ పనులు చేస్తున్నారు.అందుకోసం ఆలయ ప్రాకారానికి ఇరువైపులా సారవ కొయ్యలు, నిచ్చెనను ఉంచారు. ఆలయంలోకి పార్థసారథి రెడ్డి ఎప్పుడు ప్రవేశించాడో... ఎలా వెళ్లాడో ఎవ్వరూ గుర్తించలేదు.అర్ధరాత్రి ఆలయంలో సంచరించాడు.శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. మొదట రూ.750రాహు కేతు సర్పదోష నివారణ పూజా మండపం పైకి ఎక్కాడు.అక్కడికి సమీపంలో ఉన్న నిచ్చెనను తీసుకున్నాడు. ఆలయ మూడో గోపురం పక్కనే ప్రాకారం నుంచి నిచ్చెన అనువుగా ఏర్పాటు చేసుకుని కిందకు దిగాడు. సన్నిధి వీధిలో వున్న ఓ లాడ్జిలో పని చేసే యువకుడు ఆలయం నుంచి పార్థసారథి రెడ్డి బయటకు రావడం గుర్తించి ప్రశ్నించాడు.ఇది గమనించిన స్థానికులు బ్లూ కోల్ట్ పోలీసులకు పార్థసారథి రెడ్డిని అప్పగించారు. వన్‌టౌన్ పోలీసులు పార్థసారథి రెడ్డి తల్లిని, బాబాయ్‌ని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పార్థసారథి రెడ్డిని అప్పగించారు.

అసాంఘిక శక్తులు చొరబడివుంటే...?

ముక్కంటి ఆలయంలో భద్రతా వ్యవస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.నిజానికి ముక్కంటి ఆలయానికి భారీ భద్రతా వ్యవస్థ ఉంది.260మంది సెక్యూరిటీ గార్డులు,32మంది హోంగార్డులే కాక 17మందితో కూడిన ఎస్పీఎఫ్ బలగాలున్నాయి. వీరందరినీ పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు కూడా వున్నారు.అయినప్పటికీ ఒక బాలుడు అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించడమే కాకుండా... ఎవరి కంటాపడకుండా వెలుపలికి రావడం గమనార్హం.పార్థసారథి రెడ్డి స్థానంలో అసాంఘిక శక్తులు ఆలయంలోకి చొరబడి ఉంటే పరిస్థితి ఏంటనేది ప్రశ్న.ఒకవైపు సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరోవైపు మహాశివరాత్రి ఉత్సవాలు 20 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఇంతటి కీలక సమయంలో ఇలాంటి ఘటన వెలుగు చూడడం భద్రతావ్యవస్థకు అవమానకరంగా మారింది.రెండు నెలల నుంచి కొందరు అధికారులు అత్యుత్సాహంతో ఎస్పీఎఫ్ బలగాలకు మహాద్వారం వద్ద రిజిస్టర్ నమోదు చేసే విధులను అప్పగించారు.దీంతో భద్రతా సిబ్బంది రిజిస్టర్లు చేతబట్టి వచ్చిపోయే ప్రముఖుల పేర్లు రాసుకోవడంపై దృష్టి పెట్టి అసలు విధులను గాలికొదిలేశారన్న విమర్శలు విన్పిస్తున్నాయి.

ఆలయంలో నిద్రపోయాడట!

ముక్కంటి ఆలయంలోకి బాలుడు పార్థసారథి రెడ్డి చొరబడలేదని... తెరిచి ఉన్న సమయంలోనే లోపలకు వచ్చి నిద్రపోయాడని అధికారులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు.ఆలయం మూత వేసిన సమయంలో ఎక్కడో నిద్రపోయాడని... ఆ తరువాత అనుమానాస్పదంగా సంచరిస్తున్న బాలుడిని ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారని తెలిపారు.ఆదమరిచి ఆలయంలో నిద్రపోయినట్లు ఆలయ డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఒకటవ పట్టణ పోలీసులు పేర్కొన్నారు.అయితే ఎస్పీఎఫ్ పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని ఉంటే ఆధారాలు ఎందుకు బహిర్గతం చేయలేదనేది ప్రశ్న. బాలుడు నిద్రపోయి ఉంటే ఆలయంలో అడుగడుగునా ఉన్న సీసీ కెమెరా పుటేజ్‌లను ఎందుకు వెల్లడించలేదు? అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించే సమయంలో ఒక ఫొటో కూడా ఎందుకు తీసుకోలేదు? స్థానికులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లిన తర్వాతే ఆలయ యంత్రాంగం మేలుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు.




నంబాలపల్లెలో జల్లికట్టు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2: సంక్రాంతి ముగిసినా వెదురుకుప్పం మండలంలో జల్లికట్టు నిర్వహణ మాత్రం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం నంబాలపల్లె (కేఎన్ పెంట) గ్రామంలో జల్లికట్టు జరిగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కోడెగిత్తలను తీసుకొచ్చిన యజమానులు వాటి కొమ్ములకు బహుమతులను కట్టి అల్లిలోకి వదిలారు. కోడెగిత్తలను నిలువరించే ప్రయత్నంలో కొందరు యువకులు గాయపడ్డారు.

మణీంద్రంలో ఎద్దుల పండుగ

● ఘర్షణతో ఆపేసిన పోలీసులు

రామకుప్పం, ఫిబ్రవరి 2: రామకుప్పం మండలం మణీంద్రంలో శుక్రవారం ఎద్దుల పండుగ నిర్వహించారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ పశువులను గ్రామంలో ఊరేగించి, నడివీధి గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం తమ ఎద్దులను పరుగులెత్తించారు. ఎద్దులకు కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీపడ్డారు. కాసేపటల్లో పండుగ ముగుస్తుందనగా.. చేజిక్కించుకున్న లుంగీ విషయమై మణీంద్రం, అత్తికుప్పం గ్రామాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ గొడవలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివకుమార్ మణీంద్రంకు చేరుకుని ఎద్దుల పండుగను నిలుపుదల చేశారు.

టీడీపీ దళిత నాయకుడి కుటుంబంపై దాడి

● పోలీసులకు ఫిర్యాదు

కల్లూరు, ఫిబ్రవరి 2: పులిచెర్ల మండలం పాతపేటకు చెందిన టీడీపీ దళిత నాయకుడు మునికృష్ణ, అతడి కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఈ మేరకు మునికృష్ణ భార్య కవిత కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. పాతపేటకు చెందిన మునికృష్ణ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పాతపేట ఓటర్ల జాబితాలో తప్పులపై స్థానిక బీఎల్వోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కూలిపనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తన భర్త మునికృష్ణతోపాటు మరిది హరికృష్ణ, తనను.. అదే గ్రామానికి చెందిన జి.శంకర్‌రెడ్డి, కె.భాస్కర్, జి.బాలాజి, జి.జ్ఞానమ్మ, కె.రాణెమ్మ తదితరులు దుర్భాషలాడటమే గాక దాడి చేశారని కవిత పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

సదుం, ఫిబ్రవరి 2: ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ సదుం పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ విశ్వనాథం కథనం మేరకు రాయచోటి నుంచి సదుం మీదుగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సదుం-కలికిరి మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కార్పియో వాహనం పోలీసులు ఆపినా ఆగకుండా వేగంగా ముందుకు దూసుకుపోయింది. వెంబడించగా గుండ్లూరువారిపల్లె రోడ్డు మార్గంలో వాహనాన్ని విడిచి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు పారిపోయారు. వాహనాన్ని, అందులోని 9 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం నెంబరు ఆధారంగా విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రిన్సిపాల్ కొట్టారని ఆస్పత్రిలో చేరిన విద్యార్థి

పుంగనూరు, ఫిబ్రవరి2: పుంగనూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపాల్ కొట్టారని ఇంటర్ విద్యార్థి శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరాడు. పట్టణానికి చెందిన హనీఫ్‌ఉల్లా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీలో పుస్తకాలు కొనాలని అధ్యాపకులు ఒత్తిడి చేయగా, తాను బయట పుస్తకాలు కొనుగోలు చేస్తానని, ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారని అనడంతో తనను ప్రిన్సిపాల్ కొట్టారన్నాడు. తన కంటికి దెబ్బ తగలడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పాడు. ఈ విషయంపై కాలేజీ ప్రిన్సిపాల్ వసామా మాట్లాడుతూ.. సహ విద్యార్థులను హనీఫ్‌ఉల్లా దుర్భాషలాడటం, కాలేజీకి సక్రమంగా రాకపోవడంతో మందలించినట్లు తెలిపారు. పరీక్ష ఫీజులు చెల్లించాలని చెప్పడంతో తమపై ఎదురుతిరిగి అతడే బట్టలు చింపుకొని వచ్చేశాడని వివరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మంత్రి రోజా అనుచరుడిపై తిరుత్తణిలో ముసుగు వ్యక్తుల దాడి



గాయపడిన ప్రత్యూష్

నగరి, ఫిబ్రవరి 2: మంత్రి రోజా ప్రధాన అనుచరుడు ప్రత్యూష్‌పై తిరుత్తణిలో గుర్తుతెలియని ముగ్గురు ముసుగు ధరించిన వ్యక్తులు శుక్రవారం ఉదయం తిరుత్తణిలో దాడి చేశారు. వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దాడి జరగ్గా, గాయపడిన ప్రత్యూష్‌ను మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తిరుత్తణి సీఐ మదిఅరసన్, ఎస్ఐ రాకీకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడికి నగదు లావాదేవీలా? లేక రాజకీయ కారణాలా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

తిరుమలలో ధార్మిక సదస్సుకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆస్థానమండపంలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సనాతన ధార్మిక సదస్సుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో 59మంది పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.మరికొంతమంది వర్చువల్‌గా సదస్సులో పాల్గొని ధార్మిక అంశాలపై చర్చిస్తారు.సదస్సు ఏర్పాట్లను శుక్రవారం అధికారులతో కలిసి టీటీడీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు.శనివారం ఉదయం వేదస్వస్తి, టీటీడీ నిర్వహించిన ధార్మికకార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, పీఠాధిపతుల అనుగ్రహ భాషణం ఉంటాయి. మధ్యాహ్నం ప్రాథమిక గోష్టి, ద్వితీయ గోష్టి కార్యక్రమాలు జరుగుతాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.44 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,233 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.18,015మంది తలనీలాలు సమర్పించారు.




మార్కెట్ అధికారులను నిలదీస్తున్న టీడీపీ నాయకులు - వి.కోటలో కొత్తగా మండీలు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన స్థలం

గుట్టుచప్పుడు కాకుండా వేలం పాటలు నిర్వహిస్తారా?

● పలమనేరులో మండీల వేలాన్ని అడ్డుకున్న టీడీపీ నేతలు

పలమనేరు, ఫిబ్రవరి 2: పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద శుక్రవారం గుట్టుచప్పుడు కాకుండా మండీల వేలంపాటలు నిర్వహించేందుకు ప్రయత్నించిన అధికారులను టీడీపీ నాయకులు అడ్డుకొన్నారు. దీంతో గత్యంతరం లేక వేలం పాటలను శనివారం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వివరాలిలా... పలమనేరు మార్కెట్ కమిటీకి వి.కోటలో అనుబంధ మార్కెట్ వుంది. వి.కోట-కుప్పం రహదారిలో శివునికుప్పం సమీపంలో రహదారి పక్కనే పలమనేరు మార్కెట్ కమిటీకి చెందిన సుమారు 7 ఎకరాల స్థలంవుంది.ఈస్థలంలో కొత్తగా మామిడికాయల మండీలను ఏర్పాటుచేస్తే వి.కోట, రామకుప్పం ప్రాంత రైతులకు అనువుగా మార్కెట్ సౌకర్యం కల్పించినట్లు అవుతుందని అధికారులు భావించారు. దీంతో లక్షలాది రూపాయలువెచ్చించి ఎగుడుదిగుడుగా ఉన్న ఈస్థలాన్ని చదును చేయించారు. ఇక్కడ దాదాపు 40 మండీలు ఏర్పాటుచేసే అవకాశం వుంది. ఈ మండీలను కేటాయించేందుకు అధికారులు మార్కెట్ కమిటీ పరిధిలో లైసెన్సులు కలిగి ఉన్నవారు మాత్రమే మండీల కేటాయింపునకు నిర్వహించే వేలం పాటలో పాల్గొనే విధంగా నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారులు మండీల వేలం పాటలకు సంబంధించి ఏ పత్రికా ప్రకటన కూడా ఇవ్వలేదు. కడప ఆర్డీ సమక్షంలో వేలం పాటలు నిర్వహించేందుకు నిర్ణయించారు. కేవలం వైసీపీ మద్దతుదారులకు మాత్రమే అవకాశం ఉండేవిధంగా ఈ వ్యవహారం నడపడంతో విషయం తెలుసుకొన్న వి.కోట, పలమనేరు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పలమనేరు మార్కెట్ యార్డుకు చేరుకొన్నారు. ఏమాత్రం ప్రచారం చేయకనే మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయాన్ని గండికొట్టేవిధంగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు మండీల వేలం పాటలు నిర్వహిస్తారని మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ తోపాటు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్‌ను నిలదీస్తూ బైఠాయించారు. వేలం పాటలు నిర్వహించేందుకు వచ్చిన ఆర్డీ కార్యదర్శి గదిలో ఉన్నందున ఆ గదిలోకి కూడా చొచ్చుకొని వెళ్లేందుకు తీవ్రంగా ప్రయిత్నించారు. అప్పటికే వివాదం ముదురుతుండటంతో సీఐ చంద్రశేఖర్, తమ సిబ్బందితో అక్కడికి వచ్చి ఆర్డీ గదిలోకి టీడీపీ నాయకులను వెళ్లకుండా అడ్డుకొన్నారు.శాంతియుతంగా అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు.ఆతర్వాత మండీల వేలం పాటలను శనివారం నిర్వహించేందుకు ఆర్డీ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా మార్కెట్ అధికారి పరమేశ్వరన్, కార్యదర్శి సంజీవకుమార్ ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులకు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఆందోళనలో వి.కోట మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, పలమనేరు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి, నాయకులు గిరిబాబు, నాగరాజు, బ్రహ్మయ్య, ఖాజాపీర్, మన్నారునాయనిపల్లి ఆనందనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలంలో నేతలతో చర్చిస్తున్న పులివర్తి నాని

ప్రతిష్ఠాత్మకంగా 'రా.. కదలిరా' నిర్వహిద్దాం

● టీడీపీ శ్రేణులకు పులివర్తి నాని పిలుపు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 2: గంగాధరనెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద ఈనెల ఆరో తేదీన చంద్రబాబు హాజరుకానున్న రా...కదలిరా బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిద్దామని టీడీపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం బహిరంగ సభ స్థలం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాష్, పలువురు నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, పార్లమెంట్ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, మండల ప్రధానకార్యదర్శి జ్యోతీశ్వరరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, నేతలు భాస్కర్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, మురళీశ్వరరెడ్డి, సిద్దయ్య శెట్టి, గిరినాయుడు, జయప్రకాష్, రాజేష్ పాల్గొన్నారు.

ఆరు మండలాలకు ఇన్‌చార్జిల నియామకం

రా...కదలిరా బహిరంగసభ కోసం ఆరు మండలాలకు ఇన్‌చార్జిలను నియమించారు. గంగాధరనెల్లూరుకు మలశెట్టి వెంకటేశ్వర్లు, పాలసముద్రానికి యుగంధర్, పెనుమూరుకు దొడ్డపనేని రాజానాయుడు, వెదురుకుప్పానికి నైనారు పున్నారావు, కార్వేటినగరానికి శివకుమార్, శ్రీరంగరాజుపురానికి ఫర్వీన్‌తాజ్ ఉన్నారని పులివర్తి నాని తెలిపారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి

చిత్తూరు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా, నియోజకవర్గ, డివిజన్, వార్డు స్థాయి నాయకులందరూ సభ విజయానికి కృషిచేయాలన్నారు. నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, సుబ్రమణ్యం నాయుడు, త్యాగరాజన్, జయచంద్ర నాయుడు, మోహన్‌రాజ్, శశికర్ బాబు పాల్గొన్నారు.



జోరందుకున్న ఏర్పాట్లు

బహిరంగ సభ నిర్వహించే స్థలంలో ఏర్పాట్లు జోరందుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శ్రీరంగరాజుపురం, గంగాధరనెల్లూరు, కార్వేటినగరం మండలానికి చెందిన టీడీపీ నేతలు ఆధ్వర్యంలో సుమారు 10 ఎక్స్‌కవేటర్లతో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు, చిన్న చిన్న రాళ్లను తొలగించారు. సాయంత్రానికల్లా స్థలాన్ని శుభ్రం చేశారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి : డీఆర్వో

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో రాజశేఖర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్ పరీక్షల అధికారులతో సమీక్షించారు. పరీక్షలు మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు 50 పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయని చెప్పారు. 15,905 మంది ప్రథమ, 16,852 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. డీఈవీవో సయ్యద్ మౌలాలా, డీఈవో విజయేంద్ర రావు, డీఈసీ సభ్యులు దయానంద రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని డీఆర్వో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డీఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత మార్పులు, చేర్పులను అత్యంత జాగ్రత్తగా చేస్తున్నామని చెప్పారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, జీడీ నెల్లూరు ఈఆర్వో భవాని, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేపట్టామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 256 జగనన్న లే అవుట్లలో 24,699 ఇళ్ల స్థలాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసిందని చెప్పారు. రెండ్రోజులుగా 92 గ్రామ, వార్డు సచివాలయాల్లో వీఆర్వోలు వెయ్యి ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. ఇలా రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తిపై పదేళ్ల తర్వాత సంపూర్ణ శాశ్వత హక్కులు లభిస్తాయని, ఆ డాక్యుమెంట్లలో పేర్కొన్నట్లు వివరించారు. డాక్యుమెంట్‌లో ఆ స్థలానికి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విలువ, భూ సేకరణ ద్వారా ఆ భూమిని సేకరిస్తే ఉన్న విలువను కూడా ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం అన్ని చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ క్రమంలో శుక్రవారం యాదమరి మండలం కోణాపల్లె సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.



కోణాపల్లె సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

ఐఏఎస్‌ల తీరు బాధాకరం

టీడీపీ, జనసేన

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 2: చేసిన తప్పులకు ఇప్పటికే కొందరు ఐఏఎస్‌లు శిక్ష అనుభవిస్తున్నా కొత్తగా వచ్చిన వారిలో ఏ మాత్రమూ మార్పు కనిపించకపోవడం బాధాకరమని టీడీపీ, జనసేన నాయకులు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ నాయకుడు వూకా విజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషర్ ఆదితి సింగ్ స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికెళ్లి సన్మానాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కుమారుడు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం, మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఇద్దరు ఐఏఎస్‌ల తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈసీ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ఆ ఇద్దరు అధికారులను రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికార పార్టీకి తగినట్లుగా అధికారుల బదిలీలు జరిగాయని ఆరోపించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో జరుగుతున్న అవకతవకల వల్ల ప్రజాస్వామ్యంపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వూకా విజయకుమార్, కిరణ్ రాయల్

కలెక్టర్‌ను ఈసీ రీకాల్ చేయాలి

జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ లక్ష్మీశాను ఈసీ రీకాల్ చేయాలని టీడీపీ తిరుపతి నగర అధ్యక్షుడు చిన్నబాబు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కలెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తి తిరుపతి ఎమ్మెల్యే ఇంటికెళ్లి కలవడం, సన్మానం చేయడం దారుణమన్నారు. కలెక్టర్‌ను కేంద్ర ఎన్నికల సంఘం రీకాల్ చేసి ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని ఒంగోలుకు మార్చడం అక్కడ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించేందుకేనని ఆరోపించారు. వైసీపీకి విధేయుడిగా ఉంటున్న తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డిని తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేయడం కూడా అలాంటిదేనన్నారు. తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్‌రెడ్డిని డీటీసీగా బదిలీ చేశారన్నారు. టీడీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, స్రవంతి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



రాహు కేతు పూజల్లో రష్యన్ భక్తులు

ముక్కంటి సేవలో రష్యన్లు

శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం 30మంది రష్యన్లు దర్శించుకున్నారు.అంతకుముందు ఆలయంలోని రాయలవారి మండపంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకున్నారు.దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితుల ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయంలోని పొగడ చెట్టు వద్ద శివనామస్మరణ చేశారు.ముక్కంటి ఆలయ శిల్ప సౌందర్యం ఆకట్టుకుందని తెలిపారు.

- శ్రీకాళహస్తి

జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 అనుసంధాన పనులు షురూ



శ్రీహరికోటలోని షార్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఈ ఏడాది తొలి రోజు ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. ఇదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. ఇందులో అత్యాధునిక 19 పేలోడ్‌లను కూడా పంపుతున్నారు.షార్‌లోని రెండో ప్రయోగ వేదిక వద్ద ఇప్పటికే రెండు దశల అనుసంధాన పనులు పూర్తి కాగా మూడవ దశ పనులు జరుగుతున్నారు.గత నెల 27న బెంగళూరులోని ఉపగ్రహ తయారీ కేంద్రం నుంచి ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహాన్ని షార్‌కు తీసుకొచ్చారు. క్లీన్‌రూమ్‌లో ఉపగ్రహాన్ని పెట్టి తుది పరీక్షలు నిర్వహించారు.దీన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చి రాకెట్ శిఖర భాగాన అనుసంధానిస్తారు. 2275 కిలోల బరువు గల ఇన్‌శాట్-త్రీడీ ఉపగ్రహం ద్వారా వాతావరణ పరిస్థితుల అంచనాతో పాటు విపత్తుల హెచ్చరికలను తెలుసుకోవచ్చు.

- సూళ్లూరు పేట

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఎగ్జిబిషన్లతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుదల



మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 2: ఎగ్జిబిషన్లలో ప్రదర్శించే ప్రయోగాలను వీక్షించడం ద్వారా విద్యార్థుల్లో మేధోశక్తి మరింత పెరగడానికి దోహదపడుతుందని మదర్‌థెరీసా కళాశాల అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మదర్‌థెరీసా కళాశాలలో ఎగ్జిబిషన్‌ను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి విభిన్న ఆలోచనలతో తయారుచేసిన ప్రయోగాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడం ప్రయోజనకరమన్నారు. మదర్‌థెరీసా కళాశాల హైస్కూల్ విద్యార్థులు కలసి టెక్నాలజీకి అనుగుణంగా తయారుచేసిన ఫార్ములాలు విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత రెడ్డి, హెచ్‌వోడీ రామూర్తి, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జీఎం సురేష్, సినాప్సిస్ కంపెనీ ప్రతినిధి స్వాతి, పద్మనాభన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మందికి ఉద్యోగాలు



గంగవరం, ఫిబ్రవరి 2 : స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంవీఆర్ డిగ్రీకళాశాల ఆవరణలో బెంగళూరుకు చెందిన సన్నిధి, విస్ట్రన్ కంపెనీ నిర్వాహకులు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 40 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, కిషోర్‌కుమార్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాక్ట్ 27ను వెంటనే రద్దు చేయాలి



రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి2: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ల్యాండ్ యాక్ట్ 27ను వెంటనే రద్దు చేయాలని పుంగనూరు న్యాయవాదుల గుమాస్తాలు డిమాండ్ చేశారు. శుక్రవారం కోర్టు సమీపంలోని బైపాస్‌రోడ్డుపై రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలు ప్రజలకు అనుకూలంగా ఉండాలని, ప్రజా వ్యతిరేక విధానాలు చేపట్టరాదన్నారు. ఈ చట్టం వల్ల రాజకీయ నాయకులకు లబ్ధి చేకూరుతుందని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల గుమాస్తాలు భక్తస్వామి, సుబ్బు, వెంకటస్వామి, మమత, సుధాకర్, అమర, సాదిక్, శివాజీ, వెంకటేశ్, ఖాసీమ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

సదుం, ఫిబ్రవరి 2: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి గిరీషా సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బీసీ, ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల్లో పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తరగతి గదుల్లో పరిసరాల్లో మలాథిన్ ద్రావణం పిచికారీ చేయించారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడతారని, పరిసరాల శుభ్రతతో దోమలను నియంత్రించవచ్చునని విద్యార్థులు, సిబ్బందికి తెలియజేశారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్-యూనిట్ అధికారి సాగర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయభాస్కర్, నీలకంఠ, కమ్యూనిటీ ఆరోగ్య, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి టీడీపీ పెద్దపీట

రామకుప్పం, ఫిబ్రవరి 2: గ్రామాల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండలం పీఎంకేతాండా, పంద్యాలమడుగుల్లో నిర్వహించిన గ్రామ వికాస సమావేశాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి ఏకోశానా జరగలేదన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా టీడీపీ పాలనలో చేసిన అభివృద్ధే కన్పిస్తోందన్నారు. ఈ తేడాను రాష్ట్ర ప్రజలంతా గమనించారని, గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తేనే సాధ్యమని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారన్నారు. ఈ సమావేశాల్లో తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, మనోహర్, వెంకటరమణ, జ్ఞానశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడు, మునిరాజునాయక్, జేయి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువత కుప్పం అధ్యక్షుడిగా నితిన్‌రెడ్డి



రామకుప్పం, ఫిబ్రవరి 2: వైసీపీ యువజన విభాగం కుప్పం నియోజకవర్గం అధ్యక్షుడిగా రామకుప్పం జడ్పీటీసీ నితిన్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో యువత పార్టీ పట్ల ఆకర్షితులయ్యేలా కృషి చేస్తానని నితిన్‌రెడ్డి తెలిపారు.

క్యాంపస్ సెలెక్షన్లలో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ



కుప్పం, ఫిబ్రవరి 2: కుప్పం ఐఆర్ఎం కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంటు కార్యక్రమంలో 27మంది విద్యార్థులు ఎంపికయ్యారని చైర్మన్ దయానిధి, అకడమిక్ డైరెక్టరు మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి తెలిపారు. బ్రాండ్-4 కంపెనీ, పల్లెటెక్నాలజీస్ కంపెనీలకు నల్గురు చొప్పున, రాండాస్ ఇండియా కంపెనీకి 19మంది విద్యార్థులు ఎంపికైనట్టు తెలిపారు.

ముస్లింకు అండగా నిలిచింది టీడీపీనే..



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఖాదర్‌బాషా

కుప్పం, ఫిబ్రవరి 2: కుప్పం నియోజకవర్గంలో ముస్లింకు అండగా నిలిచింది టీడీపీనేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. ముస్లిం కోసం టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను తెలిపే కరపత్రాలను ఆయన శుక్రవారం కుప్పం పట్టణంలో ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో ముస్లిం కోసం షాదీఖానాలు, మసీదుల ఆధునీకరణ చేపట్టిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి అభివృద్ధిని పాలకులు పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం మైనారిటీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. ముస్లింకు తీరని ద్రోహం చేసిన వైసీపీ ప్రతి ఒక్కరూ తగురీతిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అన్సర్, మునాఫ్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

సోమల, ఫిబ్రవరి 2: సోమల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో దినకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని 15 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసింది.

ప్రతి ఇంట్లో 'మహాశక్తి'పై చర్చ జరగాలి : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, ఫిబ్రవరి 2 : టీడీపీ ప్రకటించిన మహాశక్తి పథకాల గురించి ప్రతి ఇంట్లో చర్చ జరిగే విధంగా కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆరిముత్తనపల్లె శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర్లో ఉన్నాయని, సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు చేకూరే లబ్ధి గురించి వివరించాలన్నారు. ఇంటింటికి తెలుగుదేశం పేరుతో గ్రామాల్లో పర్యటించినప్పుడు వైసీపీలో, టీడీపీ జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమం మధ్య తేడాను ప్రజలకు వివరించేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, నేతలు చంద్రశేఖర్, నాగరాజు, మణి, నామాలప్ప, నారాయణస్వామి, ప్రకాష్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఐటీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలోని మండల ఐటీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సతీష్ కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇతర టీడీపీ నేతలు పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ విలేకర్లతో మాట్లాడారు. గురువారం టీడీపీ సోషల్ మీడియా నేతలు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు వైసీపీ నేతలను ఉద్దేశించి పెట్టారంటూ అధికార పార్టీ సోషల్ మీడియా కోర్డినేటర్ అశ్వత్‌బాబుతోపాటు కొంతమంది వైసీపీ నేతలు కలిసి గురువారం రాత్రి మండల ఐటీడీపీ సతీష్ ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులపైన దాడికి ప్రయత్నించి, దౌర్జన్యం చేశారన్నారు. ఏదైనా ఉంటే సోషల్ వేదికగానే సమాధానం చెప్పాలే తప్ప ఇలాంటి నీచానికి వడగట్టం తగదన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, ప్రధానకార్యదర్శి నాగరాజు, కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర, నాయకులు ఆర్ఎస్ మణి, సత్యేంద్రశేఖర్, రాజకుమార్, రవి, నాగభూషణం, శివ, రమేష్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతికి చంద్రబాబు పెద్దపీట

కుప్పం : రాష్ట్రంలో వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబు పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సామగుట్టపల్లెలో టీడీపీ పాలనలో వన్నెకుల క్షత్రియులకు సీఎంగా చంద్రబాబు చేసిన పనులను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం వన్నెకుల క్షత్రియులకు కమ్యూనిటీ భవనం నిర్మించింది చంద్రబాబేనన్నారు. వైసీపీ నేతలు ఆ భవనానిక రంగులు వేసి గొప్పలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని యామిగానిపల్లె, వెండుగంపల్లె, కర్లగట్ట, పీబీనత్తం గ్రామాల్లోని ధర్మరాజుల ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, ఇతర నేతలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం : చల్లా బాబు



జయహో బీసీ సభలో ప్రసంగిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 2: బీసీలంతా టీడీపీ వైపే ఉన్నారని, వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ చిన్నబెస్తపల్లిలో శుక్రవారం టీడీపీ జయహో బీసీ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి ఏ నిధులు మంజూరు చేయకుండా మొండిచేయి చూపిందన్నారు. బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబుకే దక్కిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం బీసీలకు అందించిన పథకాలన్నింటినీ అటకెక్కించారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బీసీలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

చల్లాబాబు పర్యటన విజయవంతం చేయండి

రొంపిచెర్ల : పుంగనూరు పట్టణంలో ఈనెల 4వ తేదీ నుంచి జరగనున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఇంటింటి పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరు హరిబాబు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో కలిసి కరపత్రాలు ఇచ్చి టీడీపీ చేపట్టిన పథకాలను తెలియజేస్తారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతచేయాలని కోరారు.

మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరిక



పలమనేరు,ఫిబ్రవరి2 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో వి.కోట మండలం ముదరందొడ్డి పంచాయితీ సుద్దుల కుప్పం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. సుద్దులకుప్పం గ్రామానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు దాముయాదవ్, మరోవార్డు సభ్యుడు, సచివాలయ కన్వీనర్ ఎల్.నాగరాజు, నాయకులు జి.నాగరాజు, దిలీప్‌కుమార్, రవికుమార్ తదితరులు తెలుగు దేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వి.కోట మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు రాంబాబు, ఈశ్వర్, హరి, సుబ్రమణ్యంశెట్టి, దామోదర్, సతీష్, వజేంద్రబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన మైనార్టీ యువకులు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 2: మండలంలోని దేవిరెడ్డిపల్లెలో ముస్లిం మైనార్టీ యువకులు జనసేన పార్టీలో చేరారు. శుక్రవారం జనసేన నియోజకవర్గ నాయకుడు పసుపులేటి దిలీప్ ఆద్వర్యంలో మైనార్టీలు షౌకత్, ఉస్మాన్, రషీద్, మస్తాన్, నూరుల్లా, ఇబ్రహీం, రఫి, మహబాషా, మౌలా, సికిందర్, సన, నౌషాద్, నవాజ్, లుకుమన్, జబి, ఫరూక్, లియాకత్, వాజిద్, మున్నా, సలీం, జాఫర్, ఖాదర్‌బాషా, నయీం తదితరులు జనసేన పార్టీ కండువాలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు రంపాల శివ, సోమశేఖర్, నాగరాజు, రమేష్, నగేష్, రవి, టీడీపీ నాయకులు మున్వర్ సాహెబ్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యం



కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ రామకృష్ణారెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి2: కాంగ్రెస్‌పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలసి పార్టీ ప్రతిష్ట కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడానికి వైసీపీ కృషి చేస్తుందని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నమ్మించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సాజిద్‌అలీ, మౌసీనా, ఇమ్రాన్, బాబులాల్, ఆసీఫ్, రామకృష్ణ, రాజశేఖర్, శ్రీదేవి, ఈశ్వర్, నాసిర్‌బాషా పాల్గొన్నారు.

గుట్టకు పట్టా ఇవ్వలేను : వీఆర్వో

కార్వేటినగరం, ఫిబ్రవరి 2: 'అన్నూరులో గుట్టకు డీకేటీ పట్టా ఇవ్వాలని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు నాపై ఒత్తిడి తెచ్చారు. దానికి నేను లొంగకపోవడంతో సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని వీఆర్వో తేజ శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న తరుణంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారికి ఎదురు తిరిగితే తన ఉద్యోగానికి కూడా ఎసరు పెడతారని ఆయన పేర్కొన్నారు.

335 మందికి వైద్య పరీక్షలు

పాలసముద్రం, ఫిబ్రవరి 2: ఆముదాల సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 335 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణ మోహన్, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ కీర్తి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని చార్వాగానిపల్లి సచివాలయ పరిధిలో సీఎస్ అగ్రహారంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 359 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అనిల్‌కుమార్, హర్షవర్దన్, రాజశేఖర్, మీనసయ్యద్, ఏవో పూర్ణచంద్రారెడ్డి, భాగ్యలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

గుడిపాల, ఫిబ్రవరి 2: గుడిపాల అన్న క్యాంటీన్‌లో శుక్రవారం 192వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లి రవినాయుడు సహకారంతో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు మురళీ నాయుడు, కిట్టు, నాగరాజ యాదవ్ పాల్గొన్నారు.

పూతలపట్టు: అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో పాలకూరు పంచాయతీ టీడీపీ మాజీ సర్పంచ్ నీలవేణి, వేణు దంపతులు శుక్రవారం భోజనం వితరణ చేశారు. టీడీపీ నాయకులు వెంకటరమణా రెడ్డి, చిన్నబ్బ, రమేష్, యువరాజు, హేమాద్రి, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టును ప్రారంభించిన ఆరణి

చిత్తూరు, ఫిబ్రవరి 2: నగర శివారు ఇరువారం సమీపంలోని ఐవోసీఎల్ భవనం పక్కన నూతనంగా నిర్మించిన ప్రో-ఆరేనా ఇండోర్ బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొంతసేపు ఐవోసీఎల్ నిర్వాహకులతో షటిల్ ఆడారు. ఐవోసీఎల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2: కాణిపాక క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చెన్నైకి చెందిన తిలకవతి రూ.1,00,016, గో సంరక్షణట్రస్టుకు రూ.1,00,016 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'జీడీనెల్లూరు' అభివృద్ధికి రూ.65 లక్షలు

సామాజిక బాధ్యతలో భాగంగా అందజేసిన ఐవోసీఎల్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) రూ.65 లక్షలు అందజేసింది. శుక్రవారం జేసీ క్యాంపు కార్యాలయంలో ఐవోసీఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ యోహాన్ కుమార్ ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జేసీ శ్రీనివాసులుకు అందజేశారు. జేసీ మాట్లాడుతూ శ్రీరంగరాజపురం మండలం పిల్లారికుప్పంలో కమ్యూనిటీ హాల్, గంగాధరనెల్లూరు మండలం ఆవులపల్లిలో మైనార్టీ కాలనీ వద్ద సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఈ నిధులు వినియోగిస్తామని చెప్పారు. ఐవోసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేవీవీ సతీష్‌కుమార్, ఆపరేషన్స్ సీనియర్ మేనేజర్ బాలమురుగన్‌తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ

పాలసముద్రం, ఫిబ్రవరి 2: వనదుర్గాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. ఎంఈవో-2 గిరిజ, హెచ్‌ఎం కోదండయ్య, సర్పంచ్ నరసింహరాజు, విశ్రాంత హెచ్ఎం ఎస్.వెంకటరాజు, పూర్వవిద్యార్థులు మోహన్ రాజు, సతీష్ పాల్గొన్నారు.

నగరి డీఎస్పీగా నరసింహమూర్తి

నగరి/నిండ్ర, ఫిబ్రవరి 2: నగరి డీఎస్పీగా నరసింహమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరి రూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి నిండ్రలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

అక్కదేవతలకు పూజలు



పెద్దపంజాణి, ఫిబ్రవరి2: మండలంలోని రాయలపేటలో శుక్రవారం గ్రామస్థులందరూ కలసి అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతేడాది అక్కదేవతల విగ్రహాలను ప్రత్యేకంగా చేయించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని ఈ పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అక్కదేవతలకు శాంతి పూజల అనంతరం గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన భక్తులకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టాభిరామయ్య, సుబ్రమణ్యం, మణి, ఆనంద, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి2: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు, అర్చనలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఉత్తమ ఎంఈవోకు సన్మానం



పలమనేరు, ఫిబ్రవరి2 : రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంఈవోగా అవార్డు అందుకొన్న లీలారాణిని శుక్రవారం ఉపాధ్యాయ సంఘనాయకులు, పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో లీలారాణికి శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎంఈవో-2 బాలసుందరంతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఫిబ్రవరి2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. వేకువ జామున వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

స్కౌట్ యూనిఫాం పంపిణీ



శాంతిపురం, ఫిబ్రవరి 2: రాళ్ళబూదుగూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్రిష్టియన్ మిషనరీ వారు స్కౌట్ యూనిఫాం వితరణ చేశారు. ఆ సంస్థ అధ్యక్షురాలు గ్రేస్ మేరియా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి చాటుతూ తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య మాట్లాడుతూ నిత్య జీవితంలో ఏ విధంగా వృద్ధి చెందాలో, లక్ష్య సాధనకు ఎలా కృషి చేయాలో స్కౌట్‌లో శిక్షణ పొందుతారన్నారు. సోగడబల్ల స్కౌట్ మాస్టర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ, సేవా కార్యక్రమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో విద్యార్థులకు వివరించారు.

లక్ష్మీనరసింహుడికి అభిషేకం

కల్లూరు,ఫిబ్రవరి2: పులిచెర్ల మండలం దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహుడు భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. భక్తులకు ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా మనోజ్‌కుమార్



రొంపిచెర్ల,ఫిబ్రవరి2: రొంపిచెర్ల మండలం చెంచెమరెడ్డిగారిపల్లెకు చెందిన చంద్రగిరి మనోజ్‌కుమార్ రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడుగా నియామకం జరిగింది. ఈ మేరకు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, శివారెడ్డి, కరీముల్లా, నాగరాజు, పవన్‌కుమార్, అశ్వినీకుమార్, చరణ్ పాల్గొన్నారు.

వలంటీర్లను వైసీపీ కోసం పనిచేయాలని ఆదేశించడం దారుణం

పుంగనూరు, ఫిబ్రవరి 2: వార్డు వలంటీర్లను వైసీపీ గెలుపునకు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆదేశించడం దారుణమని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు మున్సిపల్ కమిషనర్ ప్రజల కోసం పనిచేయాలని, రాజకీయ నాయకుల కోసం పని చేయరాదన్నారు. వలంటీర్లను ఆఫీస్‌కు పిలిచి వారి నుంచి ఫోన్లు తీసుకుని వైసీపీకి పని చేయాలని చెప్పడం సరికాదన్నారు. అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేయాలని సూచించారు.

కుష్ఠురహిత సమాజానికి కృషి చేద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

యాదమరి, ఫిబ్రవరి 2: కుష్ఠురహిత సమాజానికి అందరం కృషి చేద్దామని జిల్లా కుష్ఠు నివారణ అధికారి వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, డీపీఎంవోలు, హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాన్ని ప్రతిష్ఠించాక విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

పాలసముద్రం, ఫిబ్రవరి 2: వనదుర్గాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్షా ప్యాడ్లను అందించారు. ఎంఈవో-2 గిరిజ, హెచ్‌ఎం కోదండయ్య, సర్పంచ్ నరసింహరాజు, విశ్రాంత హెచ్‌ఎం ఎన్.వెంకటరాజు, పూర్వవిద్యార్థులు మోహన్ రాజు, సతీష్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, ఫిబ్రవరి 2: పన్నూరు ఉన్నత పాఠశాలలోని 78 మంది పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య వితరణ చేశారు. ఈ సామగ్రిని హెచ్‌ఎం జానకిరామరెడ్డి పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు దొరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న వారందరికీ ఉపాధి పనులు


ఉపాధి కూలీ చిన్నమ్మను సన్మానించిన అధికారులు

ఐరాల, ఫిబ్రవరి 2: జాబ్ కార్డున్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. శుక్రవారం నాగమవాండ్లపల్లె వద్ద ఉపాధి కూలీలు చేస్తున్న పనులను పరిశీలించారు. ఉపాధి పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పనులు జరుగుతున్న ప్రదేశంలోనే వేడుకలు నిర్వహించారు. అనంతరం ఉపాధిలో వంద రోజులు పూర్తి చేసిన చిన్నమ్మను సన్మానించారు. ఏపీడీ సునీల్, ఏపీవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు, పుస్తకాల వితరణ



ఐరాల, ఫిబ్రవరి 2: ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు మోతుకూరు సోమశేఖర్ నాయుడు, సన్నపనేని వెంకటేష్ శుక్రవారం పెన్నులు, ప్యాడ్లు, పెన్సిళ్లు, తదితరాలను వితరణ చేశారు. జయచంద్రయ్య, పూలప్రభాకర్, అరుణ్‌కుమార్, మోహన్‌రాయల్, పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న తిలకవతి

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2: కాణిపాక క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి చెన్నైకి చెందిన తిలకవతి రూ.1,00,016, గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,00,016 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'జీడీనెల్లూరు' అభివృద్ధికి రూ.65 లక్షలు

సామాజిక బాధ్యతలో భాగంగా అందజేసిన ఐవోసీఎల్


జేసీకి చెక్ అందజేస్తున్న ఐవోసీఎల్ బృందం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) రూ.65 లక్షలు అందజేసింది. శుక్రవారం జేసీ క్యాంపు కార్యాలయంలో ఐవోసీఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ యోహాన్ కుమార్ ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జేసీ శ్రీనివాసులుకు అందజేశారు. జేసీ మాట్లాడుతూ శ్రీరంగరాజపురం మండలం పిల్లారికుప్పంలో కమ్యూనిటీ హాల్, గంగాధరనెల్లూరు మండలం ఆవులపురిలో మైనార్టీ కాలనీ వద్ద సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఈ నిధులు వినియోగిస్తామని చెప్పారు. ఐవోసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేవీవీ సతీష్‌కుమార్, ఆపరేషన్స్ సీనియర్ మేనేజర్ బాలమురుగన్, ఆపరేషన్స్ మేనేజర్ చిన్నారి రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.

గుట్టకు పట్టా ఇవ్వలేను: వీఆర్వో

కార్వేటినగరం, ఫిబ్రవరి 2: 'అన్నూరులో గుట్టకు డీకేటీ పట్టా ఇవ్వాలని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు నాపై ఒత్తిడి తెచ్చారు. దానికి నేను లొంగకపోవడంతో సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని వీఆర్వో తేజ శుక్రవారం మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న తరుణంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారికి ఎదురు తిరిగితే తన ఉద్యోగానికి కూడా ఎసరు పెడతారని ఆయన పేర్కొన్నారు.

335 మందికి వైద్య పరీక్షలు

పాలసముద్రం, ఫిబ్రవరి 2: ఆముదాల సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 335 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణ మోహన్, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ కీర్తి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని చార్వాగానిపల్లి సచివాలయ పరిధిలో సీఎస్ అగ్రహారంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 359 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అనిల్‌కుమార్, హర్షవర్ధన్, రాజశేఖర్, మీనసయ్యద్, ఏవో పూర్ణచంద్రారెడ్డి, భాగ్యలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో సిద్ధం సమావేశం


ప్రసంగిస్తున్న సునీల్ కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2: కరిడివారిపల్లెలోని కామరాజ్ గెస్ట్‌హౌస్‌లో వైసీపీ పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్ధం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ సోమశేఖర్, వైస్‌ఎంపీపీ శిరీష్ రెడ్డి, క్రిష్ణమూర్తి, పలువు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు

గాలి భానుప్రకాష్



నగరి, ఫిబ్రవరి 2: టీడీపీ అధికారంలోకి వస్తేనే యువతకు భవిష్యత్తు ఉంటుందని నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం నగరి పట్టణ పరిధిలోని కొత్తపేటలో యువనాయకుడు అయ్యప్ప ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి, ఉద్యోగాలు తెలుగుదేశం హయాంలోనే సాధ్యమన్నారు. నగరి టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు యుగంధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, వీకేఎస్ వాసు, మాణిక్యవాసన్, ఆర్ముగం, బాలాజీ, చంద్రశేఖర్ ఇళంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి దళిత కుటుంబాల చేరిక



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2: జిల్లేడుపల్లె దళితవాడకు చెందిన 50 కుటుంబాలు టీడీపీ సీనియర్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్ వారికి పార్టీ కండువాలు కప్పి, ఆహ్వానించారు. నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, ఏపీ కల్లు గీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహేంద్ర, జనార్దన్‌గౌడ్, హరిప్రసాద్, రమేష్, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి


వడ్డిపల్లె గ్రామస్తులతో అమరనాథరెడ్డి తదితరులు

తవణంపల్లె, ఫిబ్రవరి 2: వైసీపీ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డిఅన్నారు. శుక్రవారం మోదలపల్లె, వడ్డిపల్లె, పొన్నేడుపల్లె, దిగువతడకర, సరకల్లు, వెంగంపల్లె తదితర గ్రామాల్లో పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్‌తో కలిసి పర్యటించారు. మోదలపల్లె సర్పంచ్ చలపతి, వడ్డిపల్లె గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, దిగువతడకరలో 20 కుటుంబాలు మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా టీడీపీ విజయానికి పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండ యాదవ్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, పూత్తూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, మండల అధ్యక్షులు గాలి దిలీప్‌కుమార్, జయప్రకాష్, దొరబాబుచౌదరి, గిరిధర్‌బాబు, మోరార్జి యాదవ్, నాయకులు మోహన్‌నాయుడు, సునీల్, మధు, గోపి, శరవణ, గిరిబాబు, వినాయక, శివ, మోహన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వచ్చాక 30 ఏళ్లు వెనక్కెళ్లిన రాష్ట్రం / మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శ


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 2: టీడీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. శుక్రవారం నగరంలోని 29, 30 డివిజన్లలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని విమర్శించారు. సంక్షేమం పేరుతో సీఎం జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మేనిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. నేతలు చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కంద, రాజశేఖర్, వినోద్, నరేష్, వెంకటేష్ గౌడ్, రాణి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 2: అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకుడు నాగరాజు అన్నారు. శుక్రవారం కోదండరామాలయంలో నిర్వహించిన అర్చక సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమాఖ్య సెక్రటరీ సుధాకర్‌గురుకుల్ మాట్లాడుతూ.. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. సమాఖ్య ప్రతినిధులతోపాటు పార్టీలకతీతంగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టును ప్రారంభించిన ఆరణి


షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఫిబ్రవరి 2: నగర శివారు ఇరువారం సమీపంలోని ఐవోసీఎల్ భవనం పక్కన నూతనంగా నిర్మించిన ప్రో-అరేనా ఇండోర్ బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొంతసేపు ఐవోసీఎల్ నిర్వాహకులతో షటిల్ ఆడారు. ఐవోసీఎల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

'నగరపాలకసంస్థ'లో అవినీతిపై విచారణ జరపండి

జేసీకి టీడీపీ నాయకుల వినతి



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జేసీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు అందించాల్సిన నిధులను అధికారులు వాటాలు వేసుకుని జేబులను నింపుకుంటున్నారని ఆరోపించారు. డీజిల్, పెట్రోల్ వాడకం దానే నకిలీ బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల్లోనూ అవినీతి పేరుకుపోయిందన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నాయకులు కోదండ యాదవ్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, మేషక్, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం



గుడిపాలలో..

గుడిపాల, ఫిబ్రవరి 2: గుడిపాల అన్న క్యాంటీన్‌లో శుక్రవారం 192వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లి రవినాయుడు సహకారంతో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు మురళీ నాయుడు, కిట్టు, నాగరాజ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్న క్యాంటీన్‌లో శుక్రవారం చెన్నైకి చెందిన డాక్టర్ కౌశిక్, డాక్టర్ కీర్తిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు ధరణి నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, మహేంద్ర, రమేష్, లోకనాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో పాలకూరు పంచాయతీ టీడీపీ మాజీ సర్పంచ్ నీలవేణి, వేణు దంపతులు శుక్రవారం భోజనం వితరణ చేశారు. టీడీపీ నాయకులు వెంకటరమణా రెడ్డి, చిన్నబ్బ, రమేష్, యువరాజు, హేమాద్రి, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో..


పూతలపట్టులో..

నగరి డీఎస్పీగా నరసింహమూర్తి

నగరి/నింద్ర, ఫిబ్రవరి 2: నగరి డీఎస్పీగా నరసింహమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలునుంచి పదోన్నతిపై ఇక్కడికొచ్చారు.

రూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి

నగరి రూరల్ సీఐగా సుబ్బరామిరెడ్డి నింద్రలోని కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికొచ్చారు.

జంతువులపై దయ కలిగి ఉండాలి


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు

నగరి, ఫిబ్రవరి 2: జంతువులపై దయ కలిగి ఉండాలని పుత్తూరు డివిజన్ ఉపసంచాలకుడు గోవిందయ్య అన్నారు. నగరి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జంతుసంక్షేమం.. అవగాహన, జంతువులహింస చట్టంపై పశుసంవర్ధకశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవో శ్రీదేవి, ఏడీ వాసు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం: టీడీపీ

> గంగాధర నెల్లూరు మండలంలోని రామానాయుడుపల్లె వద్ద ఈనెల ఆరో తేదీన జరగనున్న చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేద్దామని టీడీపీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. దీనిపై శుక్రవారం పలు మండలాల్లో సమావేశమైన చర్చించారు.

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 2: 49.కొత్తపల్లెలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు బాలాజి నాయుడు, కొత్తపల్లె రమేష్, నీరంజన్‌రెడ్డి, గురునాధం, తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడురుద్రయ్యానాయుడు, నాయకులు మనోహర్‌రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, సతీష్‌రెడ్డి, భాస్కర్, పరమేశ్వర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, పసుపులేటి రమేష్, యువరాజులునాయుడు, ఎన్ఎస్‌నాయుడు, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు రాయల్ యాదవ్, డాక్టర్ థామస్ తమ్ముడు నిధి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, నాయకులు జగన్నాథం, త్యాగరాజు, లక్ష్మణ రాజు, నౌషద్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో జరిగిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పరిశీలకుడు కామేష్, నాయకులు రవినాయుడు, వెంకటేశ్ రెడ్డి, పరదేశి జగన్, మానోహర్‌నాయుడు, కాటయ్య, శరవణ, సంపూర్ణమ్మ, విజయకుమార్, కాటయ్య, పెరుమాల్ దేవి తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, నింద్ర మండలాల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

నేడు టీడీపీ సమావేశం

పాలసముద్రం, ఫిబ్రవరి 2: టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు సభ విజయవంతం చేయడంపై చర్చిస్తామని తెలిపారు.

గుడిపాల: టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, కార్యదర్శి కిట్టు తెలిపారు.

సీకే బాబుతో ఎమ్మెల్సీ భేటీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 2: చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులతో ఎమ్మెల్సీ, టీడీపీ రీజనల్ కోఆర్డినేటర్ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం : చల్లా బాబు

కల్లూరు, ఫిబ్రవరి 2: బీసీలంతా టీడీపీ వైపే ఉన్నారని, వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ చిన్నబెస్తపల్లిలో శుక్రవారం టీడీపీ జయహో బీసీ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి ఏ నిధులు మంజూరు చేయకుండా మొండిచేయి చూపిందన్నారు. బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబుకే దక్కిందన్నారు. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో 'మహాశక్తి'పై చర్చ జరగాలి

శాంతిపురం, ఫిబ్రవరి 2 : టీడీపీ ప్రకటించిన మహాశక్తి పథకాల గురించి ప్రతి ఇంట్లో చర్చ జరిగే విధంగా కార్యకర్తలు, నాయకులు ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆరిముత్తన పల్లె శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర్లో ఉన్నాయని, సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు చేకూరే లబ్ధి గురించి వివరించాలన్నారు. ఇంటింటికి తెలుగుదేశం పేరుతో గ్రామాల్లో పర్యటించినప్పుడు వైసీపీలో, టీడీపీ జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమం మధ్య తేడాను ప్రజలకు వివరించేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, నేతలు చంద్రశేఖర్, నాగరాజు, మణి, నామాలప్ప, నారాయణస్వామి, ప్రకాష్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతికి చంద్రబాబు పెద్దపీట

కుప్పం: రాష్ట్రంలో వన్నెకుల క్షత్రియుల అభ్యున్నతికి టీడీపీ అధినేత చంద్రబాబు పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సామగుట్టపల్లెలో టీడీపీ పాలనలో వన్నెకుల క్షత్రియులకు సీఎంగా చంద్రబాబు చేసిన పనులను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం వన్నెకుల క్షత్రియులకు కమ్యూనిటీ భవనం నిర్మించింది చంద్రబాబేనన్నారు. వైసీపీ నేతలు ఆ భవనానికి రంగులు వేసి గొప్పలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని యామిగానిపల్లె, మెండుగంపల్లె, కర్లగట్ట, పీబీనత్తం గ్రామాల్లోని ధర్మరాజుల ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి మునిరత్నం, ఇతర నేతలు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణోత్సవం



చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 2: కోదండరామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ బృందం, ఉత్సవ ఉభయదారులు సుగణ రాఘవన్ అయ్యాంగార్ కుటుంబీకులు, భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 2: చిత్తూరు తహసీల్దార్ మురళీమోహన్ నంద్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో శుక్రవారం ఆయన్ను సత్కరించి, వీడ్కోలు పలికారు. డీటీ కిరణ్, ఏఎస్‌వో సౌందర్‌రాజన్, ఆర్ఐ సంతోష్, సర్వేయర్లు సునీత,జయచంద్ర,సేవాతత్పరుడు పార్థసారధినాయుడు,దళితసంఘాల నేతలు మునస్వామి, ధనంజయరావు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు లభించని ఊరట

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ వల్ల ఉద్యోగులకు ఎటువంటి ఊరట లభించలేదని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవులు తెలిపారు. సగటు వేతనజీవులకూ అదే పరిస్థితి అన్నారు. ఆదాయ పన్నుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పాత, కొత్త విధానాలు యధాతథంగా కొనసాగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

4న మునీశ్వరాలయ మహా కుంభాభిషేకం

గుడిపాల, ఫిబ్రవరి 2: గొల్లపల్లి పంచాయతీ క్రిష్ణజిమ్మాపురం గ్రామంలో రచ్చబండపై నిర్మించిన మునీశ్వరస్వామి మహాకుంభాభిషేకాన్ని ఈనెల 4వ తేదిన ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు.



ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం పూర్తిచేయాలి తదితర అంశాలపై కాంగ్రెస్ శుక్రవారం నిర్వహించిన నిరసనలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్
- వెదురుకుప్పం